క్లుప్తంగా

పాఠశాలలో తనిఖీలు



ఎంపీపీ పాఠశాలలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంఈవో తాతబ్బాయిదొర

వై.రామవరం: మండలంలోని పెద్దఊలెంపాడు గ్రామ ఎంపీపీ పాఠశాలను బుధవారం ఎంఈవో కె.తాతబ్బాయిదొర సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు వండిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ తప్పనిసరిగా అమలుచేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. మెరుగైన విద్యాబోధన అందించాలని సూచనలిచ్చారు.

ఆత్మీయ సన్మానం



బదిలీపై వెళ్తున్న సబ్‌పోస్ట్ మాస్టారు ప్రసాద్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

రాజవొమ్మంగి: నర్సీపట్నం హెడ్ పోస్టాఫీస్‌కు బదిలీపై వెళ్తున్న స్థానిక సబ్‌పోస్ట్ మాస్టార్ కె.ప్రసాద్‌ను బుధవారం సిబ్బంది ఘనంగా సత్కరించారు. దుశ్శాలువా కప్పి పూల మాలలు వేసి వీడ్కోలు పలికారు. రాజవొమ్మంగి సబ్‌పోస్ట్ మాస్టర్‌గా అజయ్ కాకినాడ నుంచి ఇక్కడకు వస్తున్నట్టు తెలిపారు. సుబ్బరాజు, సీతారామరాజు, అప్పలకొండ, అప్పారావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై వినతి

పెదబయలు: వనభంగి గ్రామానికి తాగునీటి సదుపాయం కల్పించాలని వనభంగి కాలనీ వాసులు డిమాండ్ చేశారు. వనభంగి కాలనీలో పలు వీధులకు తాగునీరు సరఫరా కావడం లేదని స్థానికులు తెలిపారు. కాలనీలో తాగునీటి సమస్యపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సురేష్‌కు జనసేన నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. ప్రశాంత్‌కుమార్, కొండలరావు, నవీన్‌కుమార్, లక్ష్మణరావు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు



ఎర్రంపాడులో శిబిరానికి వచ్చిన రోగులు

రాజవొమ్మంగి: ఎర్రంపాడు, గింజర్తి గ్రామాల్లో బుధవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాల్లో 89 మందికి వైద్య సేవలందించినట్టు వైద్యులు తెలిపారు. గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక పరీక్షలు చేశారు. ఎంఎల్‌హెచ్‌పీ లక్ష్మణ్, హెచ్‌వీ రమాబాయి, హెల్త్‌అసిస్టెంట్ లక్ష్మయ్య, ఏఎన్‌ఎం సుజాత, 104 డీఈఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజా సేవలకు ప్రాధాన్యం



జడేరులోని గ్రామ సచివాలయాన్ని సందర్శించిన ఎంపీపీ కృష్ణారెడ్డి

గంగవరం : జడేరు గ్రామంలో గ్రామ సచివాలయాన్ని, ఎంపీపీ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి బుధవారం సందర్శించారు. గ్రామ సచివాయలంలో పింఛన్ల పంపిణీ ఇతర సేవలపై ఆయన ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రజా సేవకు ప్రాధాన్యమివ్వాలన్నారు. అనంతరం ఎంపీపీ పాఠశాలను సందర్శించి పిల్లల హాజరు , మధ్యాహ్న భోజన పథకం అమలు పరిశీలించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీపీ పరిశీలించారు. ఆయన వెంట పీహెచ్‌సీ వైద్యాధికారి భావన, హెచ్‌ఎం నూకరత్నం, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వ తీరుపై ధ్వజం

చింతపల్లిరూరల్: కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 10 డిమాండ్ డే నిర్వహిస్తున్నామని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్ అన్నారు. స్థానిక సీటూ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలకు తూట్లు పొడుస్తోందన్నారు. పంటలకు మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకోవాలన్నారు. లక్ష్మి, పద్మ, జ్యోతి, దేవుడమ్మ, పార్వతమ్మ పాల్గొన్నారు.

సాగుకు సన్నద్ధం

- వాతావరణం అనుకూలం
- ఊపందుకున్న దుక్కులు
- పనుల్లో గిరిజన రైతులు నిమగ్నం



రాగుల నాట్లు వేస్తున్న రైతులు



దుక్కి పనుల్లో గిరిజన రైతులు

పెదబయలు: మండలంలోని 23 పంచాయతీల పరిధిలో ఖరీఫ్ వ్యవసాయ పనులు జోరందుకున్నాయి. ఇటీవల భారీ, తేలికపాటి వర్షాలు కురుస్తుండడంతో సాగు పనుల్లో గిరిజన రైతులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే వరి సాగుకు సంబంధించి వరి నారు ముడులు సిద్ధం చేసి నారు వేశారు. వరి నాట్లకు సంబంధించి పొలాల దుక్కులు ముమ్మరంగా జరుగుతున్నాయి. వర్షాలు తక్కువగా కురుస్తున్నప్పటికీ పవర్ టిల్లర్లు సంప్రదాయ వ్యవసాయ పద్ధతి పశువులతో దుక్కులు దున్నుతున్నారు. పెదబయలు మండలంలో ఇప్పటికే బొండాపల్లి, బొండాపల్లి, కొరవంగి, కిముడుపల్లి, కుంతుర్ల, అరడకోట పంచాయతీల్లో సాగు పనులు జోరుగా జరుగుతున్నాయి. ఆయా గ్రామాల్లోని కొండవాలు ప్రాంతాల నుంచి చెక్‌డ్యాంల ద్వారా నీరు మళ్లించి వరినాట్లకు సిద్ధం చేస్తున్నారు. అలాగే ప్రభుత్వం ముందుగానే ఈ ఏడాది వరి ఇతర విత్తనాలు రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించడంతో వరి నాట్లను రైతులు సన్నద్ధం చేస్తున్నారు. దీంతో పాటుగా ఖరీఫ్ మెట్ట పంటలు రాగులు,సామలు,మెట్టు వరి పంట సాగుకు విత్తనాలు జల్లుతున్నారు. అలాగే చాలా గ్రామాల్లో రాగుల నారు వేసి నాట్లు వేస్తున్నారు. అయితే వరి నాట్లు మాత్రం ఈ ఏడాది మరింతా ఆలస్యం అయ్యే అవకాశం ఉంది. వర్షాలు పూర్తి స్థాయిలో పడకపోవడంతో వరి నాట్లు మరింతా ఆలస్యం అయ్యే అవకాశం ఉక్కువగా ఉన్నట్టు పలువురు రైతులు చెబుతున్నారు. పొలాలు దుక్కులు దున్ని వర్షాలు పడితే వరి నాట్లు వేయడానికి రైతులు సిద్ధంగా ఉన్నారు.

సకాలంలో విత్తనాలు



మండలంలోని 23 గ్రామ పంచాయతీల పరిధిలోని రైతులకు వరి విత్తనాలను సబ్సిడీ ద్వారా పంపిణీ చేశాం. రైతులు నారు మడులు వేసి సిద్ధం చేశారు. నీరు అందుబాటులో ఉన్న గ్రామాల్లో ఇప్పటికే నాట్లు వేశారు. వర్షం నీరుపై ఆధారపడి నాట్లు వేసే గ్రామాల్లో వర్షాల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. ముసురు వర్షాలు పడితే పూర్తి స్థాయిలో నాట్లు పడే అవకాశాలున్నాయి. అలాగే చాలా గ్రామాల్లో తేలిక పాటి వర్షాలకు రాగుల నాట్లు వేస్తున్నారు.

– ఏ శ్రీనివాస్,
మండల వ్యవసాయ అధికారి, పెదబయలు

గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



దాలిగుమ్మడిలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

హుకుంపేట: గిరిజన గ్రామలభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్టు అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. మండలంలోని దాలిగుమ్మడి గ్రామంలో ఆయన బుధవారం పర్యటించారు. ఈ నేపథ్యంలో గ్రామంలో జిల్లా పరిషత్ నిధులు రూ.5లక్షలతో డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానన్నారు. గ్రామల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలతో పాటు గ్రామల్లో మౌలిక సదుపాయలు కల్పిస్తానన్నారు. గిరిజన గ్రామలు అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించినట్టు ఆయన తెలిపారు.

ఎమ్మెల్యేకు సన్మానం

స్థానిక హౌసింగ్, వెలుగు కార్యాలయల్లో హౌసింగ్ డీఈ వంతినిభ రాజుబాబు, ఏఈ గౌరిశంకర్, వెలుగు ఏపీఎం చిన్నారావుల ఆధ్వర్యంలో ఆయా శాఖల సిబ్బందితో కలిసి ఎమ్మెల్యే మత్స్యలింగంను ఘనంగా సన్మానించారు. సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ, ఎంపీటీసీ సభ్యులు కొమ్మ రమ, కిలగడ సింహాచలం, నాయకులు పాంగి అనిల్, గడ్డంగి సూరిబాబు, దూసురి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరి



సీకరి పాఠశాల విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి సత్యశ్రీ

పెదబయలు: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని పెదబయలు పీహెచ్‌సీ వైద్యాధికారి సత్యశ్రీ అన్నారు. బుధవారం పెదబయలు పీహెచ్‌సీ పరిధిలోని సీకరి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలూరు పాఠశాల విద్యార్థులకు వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్యం అందించారు. 20 మంది విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేశారు. రక్తపూతలను సేకరించారు. విద్యార్థులు భోజనం తినే ముందు తప్పనిసరిగా చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలన్నారు. విద్యార్థులు చేడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, దీనిపై గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులు పోషకాహారం తీసుకుని మంచి ఆరోగ్యం సొంతం చేసుకోవాలన్నారు. ప్రతీ రోజూ చదువుతో పాటుగా వ్యాయామం చేయాలన్నారు. వర్షాకాలంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాఠశాల వంట గది, మరుగుదొడ్ల పరిసరాలు శుభ్రంగా ఉంచాలని సిబ్బందిని కోరారు. సీకరి గ్రామంలో 13 మంది గర్భిణులకు పరీక్షించారు. హెచ్‌ఎం చలపతిరావు, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మలేరియా ప్రబలకుండా ముందస్తు చర్యలు



కొత్తవలసలో దోమలమందు పిచికారీ పనులను పర్యవేక్షిస్తున్న ఎంపీపీ శెట్టినీలవేణి

అనంతగిరి: మండలంలోని ఎగువశోభ పంచాయతీ కొత్తవలస గ్రామంలోని రెండో విడత మలేరియా పిచికారీ పనులను ఎంపీపీ శెట్టి నీలవేణి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో మలేరియా కేసులు ప్రబలకుండా సిబ్బంది ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. భీమవారం, పినకోట పీహెచ్‌సీల పరిధిలోని హైరిస్క్ గ్రామాలతో పాటు లంగుపర్తి, అనంతగిరి పీహెచ్‌సీ పరిధిలోని ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. మలేరియా కేసులు నమోదువుతున్న నేపథ్యంలోని వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామస్తులు దోమలమందును ఇంటిలోపల, బయట పిచికారీ చేయించుకోవాలని సూచించారు. దోమతెరలు వినియోగించాలన్నారు. ఫాగింగ్ యంత్రాల ద్వారా గ్రామాల్లో దోమలను నివారించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఎంపీడీవో నగేష్, మలేరియా సబ్ యూనిట్ అధికారి బాబూరావు, ఎంపీహెచ్‌డబ్ల్యూ సింహాచలం, మలేరియా టెక్నికల్ సూపర్‌వైజర్ రామచంద్రరావు, ఆశ కార్యకర్త లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు మార్గం అనుసరణీయం



కొత్తభల్లుగుడ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న పాస్టర్ మాణిక్యం

అరకులోయ రూరల్: భారతీయ క్రైస్తవ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు కొత్తభల్లుగుడ, బెంజిపూర్ తదితర చర్చిల్లో జరిగిన కార్యక్రమాల్లో పాస్టర్ సంజీవ్‌కుమార్, హార్ట్ ఆఫ్ జీసస్ క్రైస్ట్ మినిస్ట్రీస్ అండ్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకుడు(డైరెక్టర్) బాక మాణిక్యం మాట్లాడుతూ క్రీస్తు మార్గం మానవాళికి ఆదర్శమని, అనుసరణీయమన్నారు. ప్రతి ఒక్కరూ శాంతి, సోదరభావం, సేవ తదితర మంచి పనులను ఆచరించాలన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంచిపెట్టారు. జ్ఞానమ్మ, సన్యాసి, సంజీవ్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



గర్భిణికి వైద్య సేవలందిస్తున్న వైద్యాధికారి రమేష్

ముంచంగిపుట్టు: వర్షాకాలం వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని అందరూ అప్రమత్తంగా ఉండాలని కిలగాడ వైద్యాధికారి రమేష్ అన్నారు. మండలంలో గల దారెల పంచాయతీ కేంద్రంలో సబ్ సెంటర్‌లో బుధవారం కిలగాడ వైద్య సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించారు. వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న గిరిజనులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. గర్భిణులకు ప్రత్యేకంగా పరీక్షలు చేశారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రమేష్ మాట్లాడుతూ వర్షాకాలంలో నిల్వ ఉన్న ఆహారం తీసుకోవద్దని, అప్పటికప్పుడు వండిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా వేడి నీటినే తాగాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎటువంటి అనారోగ్య సమస్యలు ఉన్న వైద్యులను సంప్రదించాలని ఆయన కోరారు. ఎంఎల్‌హెచ్‌పీ తులసిరత్నం, ఏఎన్‌ఎం కాంతమ్మ, రాజేశ్వరి, డీఈవో కృష్ణవేణి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

గంజాయి అనర్థాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సీఐ రమేష్, ఎస్‌ఐ అరుణ్‌కిరణ్

చింతపల్లిరూరల్: గంజాయి సాగు, రవాణాకు గిరిజనులు దూరంగా ఉండాలని సీఐ రమేష్ అన్నారు.మండల కేంద్రంలో బుధవారం వారపు సంతలో గిరిజనులకు గంజాయి సాగు దాని వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు గంజాయి సాగు, రవాణా తదితర అసాంఘిక కార్యకాలపాలకు పాల్పడి జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. గంజాయికి బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగుపై గిరిజనులు దృష్టి సారించాలన్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని ఉన్నత చదువు అభ్యసించి, ఉన్నత శిఖరాలను అందుకోవాలన్నారు. ఏజెన్సీ గ్రామాల్లో ఎక్కడ గంజాయి సాగు, రవాణా వంటి కార్యకలాపాల జరిగినా 9381123100 నంబర్‌కు సమాచారం అందించాలని ఆయన సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఆయనతో పాటు ఎస్‌ఐ అరుణ్ కిరణ్ తదితరులున్నారు.

6న పెంపుడు కుక్కలకు వ్యాక్సినేషన్



వై.రామవరం పశు వైద్యాధికారి వీరేంద్ర

వై.రామవరం: ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 6న పెంపుడు కుక్కలకు రేబీస్ వ్యాక్సిన్ ఉచితంగా వేస్తున్నట్లు స్థానిక పశువైద్యాధికారి యు.వీరేంద్ర తెలియజేశారు. స్థానిక పశువుల ఆస్పత్రితో పాటు మండలంలోని అన్ని సచివాలయాలల్లోనూ వ్యాక్సినేషన్ చేపడుతున్నామని సిబ్బందిని ఏర్పాటుచేశామని చెప్పారు. పెంపుడు కుక్కలకు రేబీస్ వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 81858 16020 నంబర్‌కు సంప్రదించాలని డాక్టర్ వీరేంద్ర కోరారు. ప్రతీ పెంపుడు కుక్క యజమానులు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

హుకుంపేట: ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ఈ నెల 6న పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాక్సిన్ వేయనున్నట్టు స్థానిక పశు వైద్యాధికారి డాక్టర్ చరణ్ ఒక ప్రకటనలో బుధవారం తెలిపారు. మండలంలోని హుకుంపేట, బాకురు పశువైద్యశాలలతో పాటు అన్ని రైతు భరొసా కేంద్రాల్లో రేబిస్ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పెంపుడు కుక్కలు కలిగిన వారందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు



దేగలపుట్టు జంక్షన్ వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులు

ముంచంగిపుట్టు: మండల కేంద్రం నుంచి కుమడ వెళ్లే మార్గంలో దేగలపుట్టు జంక్షన్ వద్ద బుధవారం ఎస్‌ఐ రవీంద్ర ఆధ్వర్యంలో విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. వాహన రికార్డులు, ప్రయాణికుల బ్యాగులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానితుల వివరాలు సేకరించి, ప్రశ్నించి విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రవీంద్ర మాట్లాడుతూ జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గంజాయి రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందన్నారు. ఆంధ్ర, ఒడిశా సరిహద్దు ప్రాంతంలో నిత్యం తనిఖీలు నిర్వహిస్తున్నామని, రాత్రిపూట పోట్రోలింగ్ సైతం చేస్తున్నామన్నారు. గంజాయి, సారా పూర్తిగా నివారణే లక్ష్యంగా పని చేస్తున్నట్టు తెలిపారు. గంజాయి సాగు, రవాణా, సారా తయారీ, అమ్మకాలు చట్టరీత్యా నేరమని, వాటికి దూరంగా ఉండాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీసు సిబ్బంది ఉన్నారు.

67 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

గూడెంకొత్తవీధి: కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు పెదవలసలోని గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత పాఠశాలలో స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి పృధ్వీష ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి పృధ్వీష మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల వల్ల కలిగే ఇబ్బందులను తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆరోగ్య సమస్యలుంటే తక్షణమే వైద్యున్ని సంప్రదించాలని సూచించారు. శిబిరంలో 67 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయగా, ఇందులో ఐదుగురికి సాధారణ జ్వరాలున్నట్టు గుర్తించామని ఆయన చెప్పారు. హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్, వైద్య సిబ్బంది బాలరాజు, దేవమణి, వార్డెన్ శ్రీనివాస్, ఏఎన్‌ఎం మంగలక్ష్మి పాల్గొన్నారు.

రిటైర్డ్ టీచర్ బంగార్రాజు మృతికి సంతాపం



బంగార్రాజు పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

జి.మాడుగుల: మండల కేంద్రంలోని రామాలయం వీధిలో గల రిటైర్డు టీచర్ మత్స్యరాస బంగార్రాజు(60) అనారోగ్యంతో బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. బంగార్రాజు మాష్టరు మరణ వార్త తెలుసుకొన్న పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు హుటాహుటినా జి.మాడుగుల వచ్చారు. బంగార్రాజు పార్థివదేహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు మాట్లాడుతూ బంగార్రాజు మాష్టర్ ఏజెన్సీలోని 11 మండలాల్లో వివిధ ప్రాంతాల్లో 30 సంవత్సరాలు పైబడి ఉపాధ్యాయుడిగా విద్యా సేవలందించారన్నారు. విద్యాభివృద్ధికి ఆయన విశేష కృషి చేశారు. అనేక మంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దారని, ఆయన సేవలు అందరికీ ఆదర్శనీయమన్నారు. మాజీ మంత్రి మత్స్యరాస బాలరాజు, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, జెడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ కె.సత్యనారాయణ, మాజీ ఎంపీపీ మత్స్యరాస వెంకటగంగరాజు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సుర్ల మత్స్యకొండంనాయుడు, ఉపాధ్యాయ సంఘం నాయకులు జి.శ్రీనివాసరావు, ప్రతాప్ తదితరులు ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలియజేశారు.

కళాశాలలో తాగునీటి సమస్య పరిష్కరించాలి



ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న గిరిజన సంఘం నాయకులు

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని గురుకుల బాలుర కళాశాలలో తాగునీటి సమస్యను పరిష్కరించాలి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి బుధవారం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో తాగునీటి సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నామన్నారు. కాలకృత్యాల కోసం విద్యార్థులు అవస్థలు పడుతున్నారని, మైలు దూరం వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. కళాశాలలో 250 మంది ఉన్నారన్నారు. అధ్యాపకుల కొరత ఉందన్నారు. విద్యా శాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో ఆందోళన చేస్తామన్నారు. నాయకులు రామారావు, బుజ్జిబాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల నిరసన

ఎటపాక: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బీజేపీ యువ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మూడే సతీష్ నాయక్ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఎటపాకలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో సతీష్‌నాయక్ మాట్లాడుతూ పార్లమెంట్ సమావేశాల్లో రాహుల్ గాంధీ చేసిన అనుచిత వ్యాఖ్యలు వెనక్కి తీసుకుని క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. దుర్గారావు, కృష్ణ, వెంకటేష్, శేఖర్, కల్యాణ్ తదితరులున్నారు.

విద్యార్థులను బడుల్లో చేర్పించాలి



లక్ష్మీపురంలోని అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ముంచంగిపుట్టు: మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ కేంద్రంలో జీటీడబ్ల్యూఏ పాఠశాల హెచ్‌ఎం ఎల్.నీలకంఠేశ్వరరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్లకార్డులు పట్టుకొని నేను బడికి పోతా కార్యక్రమం అవగాహన ర్యాలీని నిర్వహించారు. పాఠశాల నుంచి పంచాయతీ కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. అందరూ చదవాలి..అందరూ ఎదగాలి.. పిల్లలు బడికి, పెద్దలు పనికి అంటూ పలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం నీలకంఠేశ్వరరావు మాట్లాడుతూ చదువుతోనే ఉన్నత భవిష్యత్తు సాధ్యమవుతుందన్నారు. బడిఈడు పిల్లలంతా పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ఉపాధ్యాయులు బాలకృష్ణ, నాగేశ్వరరావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ గ్రామసభల్లో వినతుల వెల్లువ



మారేడుమిల్లి గ్రామసభలో పాల్గొన్న అధికారులు, గ్రామస్తులు



దాకరాయిలో గ్రామసభలో సమస్యలపై వినతులు స్వీకరిస్తున్న అధికారులు

మారేడుమిల్లి : మండలంలోని జి.ఎం.వలస పంచాయతీ పరిధిలోని వాలమూరు గ్రామంలో బుధవారం రెవెన్యూ గ్రామసభ తహసీల్దార్ ఎ.వి.రమణరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభలో కుల, మరణ ధ్రువీకరణ పత్రాలు, భూముల మ్యుటేషన్, కొత్త రేషన్ కార్డులు పొందడం తదితర అంశాల గురించి గ్రామస్తులకు తహసీల్దార్ వివరించారు. ఈ సందర్భంగా పలు రెవెన్యూ సమస్యలను గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకువచ్చి వినతులు ఇచ్చారు. దీనిపై తహసీల్దార్ రమణరావు మాట్లాడుతూ ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సర్పంచ్ లక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు కె.సువర్ణ రాజు, డీటీ బాలాజీ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : మండలంలోని దాకరాయి గ్రామంలో తహసీల్దార్ సత్యనారాయణ అధ్యక్షతన బుధవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ గ్రామసభలను స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మ్యుటేషన్, డి-పట్టాలు, ఇతరత్రా భూసమస్యలపై 14 అర్జీలు వచ్చినట్టు ఆయన చెప్పారు. ఆర్‌ఐ సత్యనారాయణ, సర్వేయర్లు వెంకటరమణ, పార్థు, వీఆర్వో రామదాసు పాల్గొన్నారు.